కాగితాన్ని పరిశీలించిన అధికారి దానిపై చర్య తీసుకుంటా నని ఆ యువకునికి హామీ యిచ్చాడు. యువకుడు ఆ భవ నంనుండి బయటుకు వచ్చాడో లేదో ఆ కాగితం అన్ని కంప్లె యింట్సులవలెనే చెత్తకుండీ పాలయింది. ఆ భవనం గోడపై వ్రాసియున్న "ప్రజాసేవయే మా కర్తవ్యం" అన్న అక్షరాలు అక్కడికి వస్తుపోతున్న ప్రయాణికులను చూస్తు వెక్కిరిస్తు న్నట్టుగా చిద్విలాసంగా నవ్వుతున్నాయి

(మనుగడ- మే 83 లో ముద్రితము)

# 16. కృష్ణయ్య ప్రేమ పెళ్ళి

రుక్మిణీ కల్యాణం భాగవతం చూసిన కృష్ణయ్యకు నిజం గానే కనువిప్పు కలిగింది. రుక్మిణి కృష్ణునికి లేఖ పంపగా అతడుపోయి ఆమెను తీసికొని వచ్చి పెళ్ళి చేసుకోవడమంతా అతని మస్తిష్కంలో మెదలసాగింది. తానెందుకు వెనుకాడు తున్నట్లు? తనకు వివాహం కాలేదు. రామయ్య మామ కూతురు రుక్కమ్మకుగూడ వివాహం కాలేదు. తానామెను ప్రేమించాడు; ఆమె తనను ప్రేమించింది. అందులో ఒకే కులంవాళ్ళు. వరుసకూడ బాగా కుదిరింది. అటువంటపుడు మనువాడుటకు భయపడటమెందుకు? సంఘానికా? ఇందు లో తాను చేసే తప్పేముంది? పెళ్ళికాకముందే అక్రమంగా ప్రవర్తించలేదు. ఇద్దరు ప్రేమించుకున్నాక పెద్దలెందుకు



కట్నం కథలు

పెళ్ళిచేయకూడదు? వాళ్లు చేయకున్నా తామెందుకు సాహసించకూడదు? అని పరిపరి విధాల ఆలోచించుకున్నాడు కృష్ణయ్య.

ఓనాటి సాయంత్రం వేళ చెరువుకట్టమీదినుంచి తామిద్దరూ వస్తుండగా రుక్మిణమ్మ తనతో అన్న మాటలు జ్ఞప్తికి వచ్చాయి కృష్ణయ్యకు.

"బావా! నా మనసేమో నీమీదనే ఉన్నది. ఇంకెవరినీ పెళ్ళాడలేను. మరి నీవేమో కడకడలకు తిరుగుతున్నావు" అన్నదామె.

"నాకుమాత్రం ఇంకొకరిమీద మనసు పోయిందటే? నేను నిన్ను తప్ప ఇంకెవరినీ పెళ్లిచేసుకోను" ఆమె కళ్ళపైకి వచ్చిన వెంట్రుకలను సవరిస్తూ అన్నాడు తాను.

"బావా! నువు మాటలతోనే మురిపిత్తవు కాని దైర్నమే లేదాయె. మావాళ్లు నాకు లగ్గం ఏర్పాటు సేత్తరట. అన్ని సేసుకునేకంటే ఏ బాయిలోన్నో పడి చచ్చుడు మంచిది" అన్నది విచారంగా.

ఆమె మాటలు విన్న కృష్ణయ్యకు చాల బాధ కలిగింది. ఈమెనీ ఆపదనుండి రక్షించడమెలా? ఏంచేయాలి? వాళ్ళయ్యకు చెప్పితే చచ్చినా వినడు. పైగా తిట్లకెగబడుతడు. ఏమిచేయాలో అతనికి తోచడంలేదు. చివరకు "నా ముందు అట్లాంటి మాటలనకే రుక్కా. నువ్వు సచ్చిపోతే నేనుమాత్రం బతుకుతానే? కానీ నాకేంచేయాలో తోస్తలేదే.

ఆ కోటిగాడినుంచి నిన్నెట్లా తప్పించాలో్న తెలుస్తాలేదు. అయినా నీ పెళ్ళెపుడు పెట్టుకుంటారే? నువు సేసుకోనని సెప్పకపోయినావు" అన్నాడు.

"ఎంత మొత్తుకున్నా మా అయ్య ఇంటూలేడు. వాడు మ్యానోడట. నా కాళ్లు సేతులు కట్టయినా సరే ఆనితోనే నా పెళ్ళి సేత్తారట. ఇంక నెలరోజులలో నాలగ్గం అయిపోద్దట. ఎట్ల బావా? ఏంచేయాలి? అన్నది రుక్కు.

"అదే తోస్తలేదే. నువ్వే ఏదైనా ఉపాయం చెప్పు.

"చెప్పన్నా? అంది హుషారుగా రుక్కు.

"చెప్పవే" మరింత హుషారుగా అని చెక్కిలి గిల్లాడు.

"ఏంలేదు, ఒకటే ఉపాయం- ఈడుంటే మనకు పెళ్ళి కాదు. నన్నా కోటిగాడికి తలుగ్గడుతరు. అందుకే ఈరోజు రాతిరి మనమెటన్న పోదాం. సెరిసగం రాత్తిరి నువ్వు మైసమ్మ గుడికాడికి వచ్చి ఉండు; నేనుకూడ వత్తా" నన్నది.

ఆమాటలు విన్న కృష్ణయ్యకు పిడుగుపడ్డట్టయింది. అమ్మబాబోయ్, లేచిపోవడమే- ఈరిగాడు లేచిపోతే వాని గతేమయింది? వెలివేసారు. కులంలోకి రానివ్వడంలేదు. ఇదంతా ఆలోచించుకొనేసరి కతనికి భయమేసింది.

"రుక్కూ! లేచిపోవుడంటే మాటలా? పోయి ఎక్కడుండేద్ది? నోట్లోకి బువ్వెట్లొచ్చేది, మళ్ళా మనం ఇంటికి రావడమెలా. వచ్చినాక ఊళ్ళోకి రానిస్తారా? అని కాసేపాలోచించి 'దాని సంగతాలోసిత్తాంలేవే' అని వెళ్ళిపోయాడు.

ఆనాటినుండి ప్లానుకోరకై ఆలోచిస్తున్నాడు. ఎంతకూ తోచి చావడంలేదు. ఇవ్వాళ రుక్మిణీ కల్యాణం చూసిన తర్వాత. అతనికి ఏనుగెక్కినంత బలమొచ్చింది. ఆనాడు రుక్కు అన్న మాటలను, తనన్న మాటలను తలచుకొని సిగ్గుపడ్డాడు- కించపడ్డాడు. ఆడదే అంత ధైర్యం చేసినంక తనకెందుకు భయం? అయినా తను చేసేదేమాత్రం తప్పు కాదు. ఊరిగాడంటే పెళ్ళయినదాన్ని లేవదీసుకబోయాడు. తానట్లుకాదు. ఎట్లాగైనాసరే, తానుకూడ శ్రీకృష్ణునివలెనే చేయాలనుకొన్నాడు. దానికి తోడీ కలియుగ కృష్ణయ్యకు భూలోక రుక్మిణి అలనాటి తీరుగనే గుడివద్ద కలుసుకొమ్మ న్నది. తన ప్లానుకూడ విజయం చెందితీరుతుంది. కొన్నా ళ్ళాగివస్తే ఊరివాళ్ళు మొదట తిట్టినా తర్వాత మన్నించక ఏంచేస్తారనుకున్నాడు. .రుక్కి నెలాగైనా కల్సుకొని రాత్రే ప్రయాణం కట్టాననుకొన్నాడు.

అమితానందంతో ఈలలు వేసుకొంటూ, కూనీరాగాలు తీసికొంటూ భలే హుషారుగా పోతున్నాడు కృష్ణయ్య రుక్కును కర్తవ్యోన్ముఖురాలిని చేయడానికై. రుక్కుతో తన సంసార సుఖాన్ని తలుచుకొంటూ పరవశం చెందుతూ నడుస్తున్నాడు. సన్నని నడుము, అందమైన చిలిపి కళ్ళు ఆకర్షణీయమైన చనుకట్టు కలిగి చకచకా నడిచే పల్లెపడుచు రుక్కు తనస్వంతం కాబోతున్నదని ఊహించుకొంటున్నాడు భావ జగత్తులో విహారంచేస్తూ వెళ్లి పొలంలో వంగి గడ్డి

కోస్తున్న రుక్కు కళ్ళను వెనుకనుంచి మూసాడు. ఆ హఠాత్సంఘటనకు ఉక్కిరిబిక్కిరైన రుక్కు ఎలాగో చేతులు విడిపించి "పో బావా! పరాయి ఆడదాన్ని యిట్లా ఎవ్వరూ లేని చోట ముట్టుకుంటే ఎవళ్లన్నా సూత్తే ఏమనుకుంటారు?" అన్నది దూరంగా జరుగుతూ.

"రుక్కూ నువ్వింక పరాయిదానివికావే. నా సంతపాదదానివే" అని ముసిముసిగా నవ్వాడు సినిమాహీరోలా.

"ఏమో బావా! నువ్వేమేమో అంటవు. మా అయ్యేమో నీతోటి మాట్లాడితే ఘుక్కలు విరుగతంతనన్నడు. నాపెళ్ళి కూడ పెట్టుకున్నారు బావా! ఇంకా పదిరోజులకటు. నాకేమీ మనసుల తట్టుతాలేదు. నువ్వేమో కదలవు. పింజెరవు" అన్నది విచారం వ్యక్తంచేస్తూ.

"నీకు భయంలేదే రుక్కు. ఆ కోటిగాడి సంగతి నేను సూత్తాను. నిన్నెపాటి సేత్తడో" అన్నాడు ఆమెను దగ్గరకు తీసుకొంటూ.

ఏం మాటలు– అంతో కొట్లాట పెట్టుకుంటావాఏంది? కొట్లాటుంటే నాకు భయమేత్త ది. ఆడేమోరౌడీయెధవ. నిన్ను ఉత్తగనే కొట్టేత్తడు" అన్నది.

"అని మొకంకొట్టడు. ఐనా నాకానితో కొట్లాటదేనికే. ఆనాడు నువ్వన్నట్లుగా వెళ్ళిపోదాం" అన్నాడు రుక్కి కళ్ళలోకి సూటిగా చూస్తూ.

ఆ మాటలకు రుక్కు అమితాశ్చర్యం చెందింది.

"నిజంగానా బావా! ఆనాడులేని ధైర్నం ఎక్కడ్నించొచ్చిందియాల్ల?" అన్నది అతనివైపు వింతగా చూస్తూ.

రుక్మిణీ కల్యాణం చూస్తే వచ్చిందని చెప్పడానికి మన సొప్ప లేదు కృష్ణయ్యకు. "ఎక్కన్నుంచి వత్తేందే. నాదగ్గరో నూరు రూపాయలున్నై. ఆనాడు నువ్వన్నట్టే సెరిసగంరాత్రి నువ్వు నీ బట్టలు పట్టుకొని ఎవ్వాలకు తెల్వకుండ మైసమ్మ గుడికాడికి రా. నేనక్కన్నే ఉంట. అదే రాత్తిరి బైలెల్లి తెల్లారే సరికి రైలెక్కి దేశంపోయి బతుకుదాం. అక్కడేదన్న కూలో నాలో సేసుకుందాం. కొన్నాళ్ళయినంక తిరిగొత్తె ఇక్కడ లొల్లి తగ్గుతది" అన్నాడు కృష్ణయ్య

"సరే బావా! నాకా కోటిగాన్ని తలుసుకుంటేనే రోత పుట్టుకొత్తది. రాత్తిరి కెళ్ళిపోదాం- నువు తయారుం' డన్నది

"ఎట్లాగైనా గట్టిదానివేనే" అని చెంపగిల్లాడు కృష్ణయ్య.

"పోబావా! నువ్వుమాత్తురం సిన్నోడివా? ఛలోక్తి విసిరింది రుక్కు—

పోదాము మనము పిల్లా, బొంబాయి బండ్లో పొల్లా
పోదాము బుల్లివాడా, బొంబాయిరైల్లో రేడా

అని పాడుకొని ఉత్సాహంగా విడిపోయారప్పటికి.

వాళ్ళనుకున్నట్టుగానే ప్లాను సక్సెస్ అయింది. ఇద్దరూ పట్నం చేరుకున్నారు. కాని పనికోరకై చాల శ్రమపడాల్సి వచ్చింది. చివరి కెలాగో కష్టపడి పని సంపాదించుకొన్నారు. ఆమెకోర కెంత కష్టపడ్డా కృష్ణయ్య కేమాత్రం శ్రమనిపించేదికాదు. ఇద్దరూ పనిచేసుకుంటూ చిలకా గోరింకల్లా కాలం

గడుపుతున్నారు. ద్వాపర యుగపు కృష్ణుడివలెనే తన ప్లాను కూడ చాలవరకు విజయవంతమైనందుకు ఈ కూలి కృష్ణయ్యకు ఆనందం కల్గింది. తర్వాత కొన్ని రూపాయలు సంపాదించుకొని సొంతూరికి సిద్ధమైనారు.

రుక్మిణీ సహితుడై వచ్చిన కృష్ణున్ని ద్వారకాపురవాసులానందంతో ఎదుర్కొన్నారు. కాని కృష్ణయ్యపై మాత్రము చీవాట్లను, శాపనార్థాలను కురిపించారు. కృష్ణయ్య తానేం తప్పుచేసానని తిడ్తున్నారని ఎంత మొత్తుకున్నా వినలేదు ఎవ్వరూ. మనసైన ఆడదాన్ని మనువాడడం తప్పా? అని అతడెంత వాదించినా అందరూ దూషించారేకాని ఎవరూ భూషించలేదు. ఇది కృష్ణయ్యకు కల్గిన మొదటి అపజయం.

కృష్ణయ్య బావమరదులాతని వీపు బద్దలు చేయడానికి వచ్చారు కాని అతని అన్నలు వాళ్ళను సముదాయించారు పంచాయితీ పెట్టుదామని. ఐనా ఆవేశం ఆగక వాళ్ళు కృష్ణయ్యను నానా తిట్లు తిట్టి రెండు దెబ్బలుకొట్టి వెళ్లిపోయారు. అలనాటి కృష్ణుడు అడ్డువచ్చిన బావమరిదిని అవమానించి పంపాడు. కాని మన కృష్ణయ్య అవమానించబడ్డాడు. ఇది కష్ణయ్యకు రెండవ అపజయం.

తర్వాత పంచాయితీ జరిగింది పంచాయితీలో కులం నుండి వెలివేయడానికి నిశ్చయించుకొన్నారు. కృష్ణయ్యెంత మొత్తుకున్నా ఎవరూ వినలేదు. తర్వాత నానా తంటాలుపడి అందరి కాళ్ళు మొక్కి కులానికి ఐదువందల రూపాయల దండుగ, వంద రూపాయల కల్లు ముట్టజెప్పి కులంలోకి

వచ్చాడు. ఆ కృష్ణయ్య అందరిచే కాళ్ళు మొక్కించుకున్నాడు. కాని మన కృష్ణయ్యకు మొక్కాల్సిన గతి పట్టింది. పాపం ఇది మూడవ అపజయం.

అంతా జరిగిపోయింది. కృష్ణయ్య, రుక్కి అన్యోన్యం గానే ఉంటున్నారు. ఇప్పుడు వారికిద్దరు పిల్లలుకూడ కలిగారు. కాని ఊళ్లోవాళ్ళు వాళ్ళను చులకనగాచూస్తూ వెలివేసి నట్లుగా చూడడం కృష్ణయ్యకు బాధ కలిగించింది. తను చేసినదాంట్లో తప్పెక్కడుందో అతని కెంత ఆలోచించినా తోచడంలేదు. అప్పుడతనికి ఆఊరి దొరగారి కొడుకు పట్నం లో లౌ మ్యారేజి చేసుకొని రెండేళ్ళు తిరిగి తర్వాత సగౌరవంగా ఇంటికి వచ్చిన సంగతి జ్ఞప్తికి వచ్చింది. "ఆ దొరకొడుకు సేసుకుంటే ఎవ్వరూ తప్పుపట్టలేదు. నన్నేమో కులం తప్పని ఏమేమో ఏడిపించారు" అని వాపోయాడు కృష్ణయ్య.

ధనవంతులు ఇట్లాంటి పెళ్ళిచేసుకుంటే "లవ్ మ్యారేజి" అని పిలువబడుతుందనీ, అది తప్పుకాదనీ, అదే పేదవాళ్ళు చేసుకుంటే ఆపేరే లేచిపోవడంగా మారి తప్పవుతుందని పాపమా నిరక్షరాస్యుడైన పల్లె కృష్ణునికి తెలువదు కాబోలు.

అలనాటి కృష్ణుడు చేసింది, తాను చేసింది ఒకే పని అయినా అతనికి భూషణలు, తనకు దూషణలు ఎందుకొచ్చాయో మన పల్లెటూరి కృష్ణయ్యకు ఎంత ఆలోచించి బుర్ర బద్దలు కొట్టుకున్నా అర్థంకాలేదు.

(స్వతంత్ర- మాస పత్రిక- 78 జనవరి)

—కాలువ మల్లయ్య